ప్రత్యేక వ్యాసం

# ఉమ్మడి పౌరస్మృతి

## భిన్నత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ కూడా కాపాడుకుందాం

కె. బాలగోపాల్.

అనుభవంతో మనుషులు కొంతయినా మారుతారనుకోవడం ఆశాజీవుల లక్షణం. సంఘ పరివార్ గురించి కూడ ఆ ఆశ పెట్టుకున్న వారు దేశంలో లేకపోలేదు. సంఘపరివార్ అనుభవంతో మారకపోలేదు గానీ, ఆశ పెట్టుకున్న జీవులు కాంక్షించే దిశలో కాదు. అనుభవంతో వారు తమ మూర్ఖత్వాన్ని వదులుకోలేదు. తగ్గించుకోనూలేదు. దానికి ఉదారవాద పదజాలపు ఆచ్ఛాదన తొడగడం నేర్చుకున్నారు. అందుకోసం ఇంగ్లీషు చక్కగా మాట్లాడగల నాయకులు కొందరు అక్కరకు వచ్చారు.

సామాన్య పౌరస్మృతి, లేక ఉమ్మడి పౌరస్మృతి ఎందుకు అవసరమని అడిగితే ఒకనాడు ఖాకీ నిక్కరు మేధావులు 'దేశ సమగ్రత కోసం, సమైక్యత కోసం అవసరం' అనే వారు. వైవిధ్యాన్ని వ్యతిరేకించే అఖండ భారత భావజాలం ఆ జవాబులో కొట్టొచ్చినట్టు కనిపించేది.

కానీ మొన్న ఇదే ప్రశ్న ఎవరో అరుణ్ జైట్లీని అడుగగా (ఉదారవాద పదజాలాన్ని అనర్గళంగా ఉపయోగించగల సంఘ్‌పరివార్ ముఖోటాలలో ఈయనొకడు) ఆయన వేరే జవాబు చెప్పాడు. వైవిధ్యం చాటున, భిన్నంగా ఉండే హక్కు మాటున దేశంలోని మత సంస్కృతులన్నీ స్త్రీలకు అన్యాయం చేశాయనీ, సమానత్వం కోసం ఉమ్మడి పౌరస్మృతి కావాలనీ అన్నాడు.

సాంస్కృతిక ప్రత్యేకతలను కాపాడుకునే హక్కు ఆయా సంస్కృతులలోని అప్రజాస్వామిక లక్షణాలను సహితం కాపాడుకునే హక్కు కాగలదు. అన్ని సంస్కృతులూ స్త్రీలను అసమాన వ్యక్తులుగా చూసాయి. కాబట్టి సాంస్కృతిక స్వయం ప్రతిపత్తికీ, స్త్రీల హక్కులకూ మధ్య ఒక వైరుధ్యం ఉంది. అరుణ్ జైట్లీ దీని గురించే మాట్లాడుతున్నాడా? ఈ కోణం నుండే ఉమ్మడి పౌరస్మృతి కావాలని కోరుకుంటున్నాడా?

అవునని తొందరపడి అనుకునే ముందు రెండు ప్రశ్నలు వేసుకోవడం ఉచితంగా ఉంటుంది.

ఏ విషయంలోనూ సమానత్వాన్ని గురించి మాట్లాడని సంఘపరివార్ మేధావులకు సాంస్కృతిక ప్రత్యేకతల కింద నలిగిపోతున్న స్త్రీల సమానత్వ హక్కు గురించి అకస్మాత్తుగా ఇంత ఆవేదన ఎందుకు కలుగుతున్నది? 'ధర్మం' అనేది సంఘ్ పరివార్ భావజాలంలో కీలకమైన అంశం. స్త్రీల విషయంలో అది గృహిణి, తల్లి, భార్య మొదలయిన పదాల చుట్టూ తిరుగుతుంది. ఖాకీ నిక్కర్ల వాళ్లు స్త్రీల పరిస్థితి గురించి సానుభూతితో మాట్లాడినప్పుడు కూడ ఈ పదజాలం నిర్వచించే ఆలోచనా చట్రంలోనే మాట్లాడతారు. ఇది అన్ని మతాలకు సామాన్యమైన సాంస్కృతిక విశేషం. దీనిపట్ల అభ్యంతరం లేని సంఘ్‌పరివార్ మేధావులు ఏ సాంస్కృతిక ప్రత్యేకతలు స్త్రీలకు చేసే ఏ హాని గురించి ఆవేదన చెందుతున్నారు? వారు భావించే సామాన్య పౌరస్మృతి స్త్రీ పౌరుల స్థితిని సాంస్కృతిక విశేషం చట్రంలోనే నిర్వచించేటట్లయితే ఆ సామాన్య పౌరస్మృతి స్త్రీల కోసం అని వాదించటంలో అర్థమేముంది?

వాదన కోసం ఎవరైనా ఏ మాటలయినా ప్రయోగించవచ్చును. కానీ సమానత్వం అనే భావనకు ఏ రూపంలోనూ సంఘ్ పరివార్ ప్రాపంచిక దృక్పథంలో ఇసుమంత కూడ చోటులేదు. భగవద్గీత నుండి 'బంచ్ ఆప్ థాట్స్' వరకు వారు ఆదరించే ఏ గ్రంథాన్నయినా చూడండి, వాటిలో ఎక్కడా సమానత్వం అనే భావన కనిపించదు.

ఒక స్థాయిలో అసమానతను సమర్థించే భావజాలాలు వేరొక స్థాయిలో సమానత్వాన్ని ఆదరిస్తాయని అమర్త్యసేన్ సమానత అనే భావనను గురించి తర్కిస్తూ అంటాడు. హైందవాన్ని ఉదాహరణగా తీసుకొని, సామాజికంగా అన్ని రంగాలలోనూ అసమధర్మాన్ని ప్రమాణంగా స్వీకరించే ఈ దృక్పథం సహితం, ఆధ్యాత్మిక సమానత్వాన్ని - జీవాత్మలన్నీ సమానంగా పరమాత్మలో భాగమన్న భావనను - ఆదరిస్తుందంటాడు. అక్కడొక్క చోటే సమానత్వం అనే భావనకు బ్రాహ్మణీయ భావజాలంలో చోటు ఉంది. నేలమీద అన్నిటా అది అసమానతా సిద్ధాంతమే.

అటువంటి వాళ్లకు స్త్రీల హక్కుల గురించి అకస్మాత్తుగా ఆవేదన ముంచుకొచ్చి అందుకోసం ఉమ్మడి పౌర స్మృతి కావాలనిపించిందంటే నమ్మడం కష్టం. అఖండ భారతంలో ఒకే మూసలో పోసిన సమాజాన్ని రూపొందించాలన్న వారి గొల్వాల్కర్ భావజాలాన్ని ఉదారవాద పద ప్రయోగంతో అలంకరించే ప్రయత్నం తప్ప అరుణ్ జైట్లీ జవాబులో వేరే ఏమీ లేదు.

రెండు సాంస్కృతిక ప్రత్యేకతలను కాపాడుకునే హక్కు చాటున అప్రజాస్వామిక సంప్రదాయాలను కొనసాగించే ప్రమాదం ఉందనేది వాస్తవమే అయినప్పటికీ దానికి జవాబు ఉమ్మడి పౌరస్మృతి ఎందుకు అవుతుంది? అన్ని సంప్రదాయాలలోని అప్రజాస్వామిక లక్షణాలపైన

పోరాటం చేయడం దానికి జవాబు అవుతుంది. ఉమ్మడి పౌరస్మృతి దానికి దోహదపడకపోగా చాలా నష్టం చేయగలదు.

దేశానికంతటికీ ఒకే ఉమ్మడి పౌరస్మృతి సంగతి పక్కన పెట్టండి. 'హిందువులు', 'ముస్లింలు' అనే వారందరికీ ఒకే పౌరస్మృతి ఉండాలనే భావనే చాలా నష్టం చేసింది. హిందువు, ముస్లిం అనేవి సామాజిక శ్రేణులు కావు. మతాచారాలకూ సంప్రదాయాలకూ సంబంధించిన భావనలు ఇవి. వాటిలోపల భిన్నమైన సామాజిక శ్రేణులు ఉన్నాయి. ఆధునిక కాలంలో ముందుకొచ్చిన మత తత్వరాజకీయాలలో భాగంగా వీటిని సామాజిక శ్రేణులుగా భావించడం జరిగింది. ఈ కృత్రిమమయిన శ్రేణుల సమీకరణ కోసం 'హిందువు'లందరికీ ఒకే పౌరస్మృతి, 'ముస్లింలు' అందరికి ఒకే పౌరస్మృతి అనే ఆలోచనలు ముందుకొచ్చాయి. ఆ మతాచారాలకు చెందిన విభిన్నమైన సామాజిక శ్రేణుల అచార సంప్రదాయాలలోని ప్రజాస్వామిక లక్షణాలు తృణీకారానికి గురయ్యాయి. ఒక సనాతన నమూనా అందరికీ ఉమ్మడి చట్టం అయింది.

1937లో షరియత్ చట్టం చేయకముందు దేశంలోని ముస్లిం ప్రజలు ఆయా ప్రాంతాలలో వారి వారి ప్రత్యేక ఆచారాల ప్రకారం వారి వ్యక్తిగత జీవితాలను నియత్రించుకునే వారు. కేరళ రాష్ట్రంలోని ముస్లిం ప్రజలు ఆ రాష్ట్రంలోని ముస్లిమేతరుల లాగే స్త్రీలకు సాపేక్షికంగా ఎక్కువ హక్కులు కల్పించే సంప్రదాయాలను అనుసరించే వారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ సరిహద్దు ప్రాంతంలోని ఇస్లాం మతం పుచ్చుకున్న తెగలు కూడ అంతే. అయితే మత వాద ఐడెంటిటీల వ్యాప్తిలో భాగంగా, 1937లో షరియత్ చట్టం చేసి, అందరిని ఒక సనాతన నమూనాలోకి తీసుకొచ్చారు. ముస్లింల ఉమ్మడి పౌర స్మృతి అయిన షరియత్ చట్టం ముస్లిం ప్రజల జీవన విధానంలోని వైవిధ్యాన్నీ ప్రజాస్వామిక లక్షణాలను ధ్వంసం చేసి సనాతన ఛాందస వాద సంప్రదాయాన్నే అందరి చట్టం చేసింది.

హిందువుల విషయమూ అంతే. ముస్లిం అనేది ఒక సామాజిక శ్రేణి కాకున్నా దానికొక నిర్వచనం ఉంది. దేవుడు ఒక్కడే, మహమ్మదు దేవుని ప్రవక్త అని నమ్మేవారంతా ముస్లింలు అని నిర్వచించవచ్చు. హిందువు అనే మాటకు ఆపాటి నిర్వచనం కూడ లేదు. ముస్లిం, క్రిష్టియన్, పార్సీ, యూదు మతస్తులు కాని వారంతా హిందువులేనని చట్టం అంటుంది. తమకు హిందువు అనే సంప్రదాయానికి చెందని భిన్నమైన ఆచారాలున్నాయని ఎవరయినా అనేటట్టయితే ఆ విషయాన్ని వారే రుజువు చేసుకోవాలి. రుజువు చేసుకోలేని వారంతా హిందువులే నంటుంది చట్టం. ఈ విధంగా, అపారమైన వైవిధ్యం ఉన్న సామాజిక శ్రేణులన్నిటినీ బలవంతంగా 'హిందువులు' చేసి పారేసారు. వారందరికీ ఒక 'ఉమ్మడి పౌరస్మృతి' వచ్చేసింది. ఇది షరియత్ అంత సంపూర్ణంగా సంప్రదాయక పౌరస్మృతి కాని మాట సత్యమే. అంబేద్కర్ వంటి వారి కృషి ఫలితంగా కొంత ఆధునీకరించబడిన మాట సత్యమే. అయితే ఆ ఆధునీకరణ సమగ్ర రూపం తీసుకోలేదు. హిందువులు అని బలవంతంగా నిర్వచించబడిన వారి ఉమ్మడి పౌరస్మృతి బ్రాహ్మణీయ సంప్రదాయాలను కొంత మేరకు లౌకిక ప్రాతి పదికన తిరగ రాయగా వచ్చిన చట్టం. అంతకంటే భిన్నమైన లక్షణాలు, అంతకంటే ప్రజాస్వామిక లక్షణాలు గల అశేష స్థానిక సంప్రదాయాలు ఈ ఏకీకరణలో తమ అస్తిత్వాన్ని కోల్పోయాయి. దాన్ని నిలబెట్టుకోవాలంటే దాని ప్రత్యేకతను కోర్టులో కూర్చున్న హిందూ జడ్జీల ముందు ఆ ప్రజాశ్రేణులే రుజువు చేసుకోవాలి కాబట్టి, అది దాదాపు అసాధ్యం కాబట్టి, కాలక్రమంలో చట్టం ఒత్తిడి వల్ల అందరూ 'హిందువులే' అయిపోయారు.

జరిగిన అన్యాయం చాలక ఇప్పుడు హిందువులకూ, ముస్లింలకూ, క్రైస్తవులకూ, యూదులకూ, పార్సీలకూ అందరికీ ఒకే పౌరస్మృతి కావాలా? అది స్త్రీలకు న్యాయం చేయడం కోసం అని అరుణ్ జైట్లీ వంటి ప్రజాస్వామ్య నుడికారం ముక్కున పట్టుకున్న ఖాకీనిక్కరు మేధావులు అనడం నేర్చుకొని ఉండవచ్చును గానీ అసలు కారణం ఏమిటో సుప్రీంకోర్టు జడ్జీలు చెప్పారు. దేశ ఐక్యతకు, సమగ్రతకు అవసరం అన్నారు. మనం దీనికి ఒప్పుకుంటే రేపు అందరూ హిందీ మాట్లాడడం దేశ ఐక్యతకూ సమగ్రతకూ అవసరం అంటారు. అన్నం తినడం మానేసి అందరూ రొట్టెలు తినడం (లేదా రొట్టెలు తినడం మానేసి అందరూ అన్నం తినడం) దేశ ఐక్యతకూ సమగ్రతకూ అవసరం అంటారు. భిన్నత్వం దేశ ఐక్యతకు నష్టకరం కాదనే ప్రాథమిక విశ్వాసంతోనే యాభై ఏళ్ల క్రింద రాజ్యాంగంలో భిన్నంగా బతికే హక్కుకు గుర్తింపు ఇచ్చారు. ఇప్పుడు ఏం మారిందని దానిని తిరస్కరించాలి?

అన్ని సంప్రదాయాలూ ఆదివాసీల సంప్రదాయాలతో సహా స్త్రీలకు అన్యాయం చేసిన మాట సత్యమే. దానికి జవాబు సంప్రదాయాల ప్రజాస్వామీకరణ, వాటి ఏకీకరణ కాదు. ప్రజాస్వామ్య దృష్టిలో అప్రస్తుతమైన భిన్నత్వం ఒక్కొక్క సంప్రదాయంలోనూ ఉంటుంది. దానినంతా వదులుకొని అందరూ ఒకే నమూనాలో ఎందుకు బతకాలి? అప్రజాస్వామిక సంప్రదాయాలను మాత్రం తప్పనిసరిగా వ్యతిరేకించాలి. దానికి ఏ మార్గం అనుసరించాలన్నది ఒక క్లిష్టమైన రాజకీయ సమస్య. దాని పరిష్కారాన్ని దేశ 'ఐక్యత' సమగ్రత'ల కోణం నుండి అన్వేషించడం అన్యాయానికి అణచివేతకూ దారి తీస్తుంది. అఖండమైన, శక్తివంతమైన హైందవ జాతిని నిర్మించాలన్న సంఘపరివార్ అజెండాకు అది పనికొస్తుంది గానీ ఏ ప్రజాస్వామిక అజెండాకూ పనికిరాదు.

☆ ☆ ☆